క్లుప్తంగా

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో.. టమాట 130, పచ్చిమిర్చి 90, బెండ 50, కాకర 50, దొండ 25, దోస 30, ఆలు 25, చామ 50, కీర 30, బీర 50, వంకాయ 40, గోకర 40, బీన్స్ 100, బీట్‌రూట్ 50, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 30, క్యారెట్ 60, చిక్కుడు 70, ఉల్లి 100 (4 కేజీలు), ములక్కాయలు (2) 10, కాలీఫ్లవర్ (1) 30 సొరకాయ (కేజీ) 30, అల్లం 320, వెల్లుల్లి 220.

బాధ్యతల స్వీకరణ



గచ్చిబౌలి: కొండాపూర్ టీఎస్ఎస్‌పీ 8వ బెటాలియన్ కమాండెంట్‌గా సి.సన్నీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇబ్రహీంపట్నం 3వ బెటాలియన్ కమాంటెంట్‌గా ఉన్న ఆయన బదిలీపై కొండాపూర్ బెటాలియన్ కమాండెంట్‌గా వచ్చారు. 8వ బెటాలియన్ కమాండెంట్‌గా ఉన్న మురళి యూసూఫ్‌గూడ 1వ బెటాలియన్ కమాండెంట్‌గా బదిలీపై వెళ్లారు.

నియామకం



సురేష్ ముదిరాజ్

మియాపూర్: తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్, మత్స్యకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మక్తమహబూబ్‌పేట్‌కు చెందిన శంకరోల్ల సురేష్ ముదిరాజ్ నియమితులయ్యారు. తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మత్స్యకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకన బోయిన రమణముదిరాజ్ నియామకపత్రాన్ని అందజేసినట్లు ఆయన తెలిపారు. సురేష్ ముదిరాజ్ మాట్లాడుతూ.. ముదిరాజ్ మత్స్య కారుల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

శేరిలింగంపల్లి తహసీల్దార్‌గా శ్రీనివాసరావు



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి తహసీల్దార్‌గా టి.శ్రీనివాసరావు సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన ఎం.వంశీ మోహన్ బదిలీ కావడంతో సిరిసిల్ల ఆర్డీఓ పని చేస్తున్న శ్రీనివాసరావుకు శేరిలింగంపల్లి తహసీల్దార్‌గా పోస్టింగ్ ఇవ్వడంతో విధుల్లో చేరారు. ఆయన గతంలో ఉమ్మడి మెదక్ జిల్లాలోని రామచంద్రాపురం, పటాన్‌చెరు, జిన్నారం తదితర మండలాల్లో తహసీల్దార్‌గా, నారాయణఖేడ్, సిరిసిల్లా ఆర్డీఓగా పనిచేశారు.

ఎమ్మెల్యే అరికపూడి గాంధీకి హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: ఓ భూ వివాదంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, పోలీసులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. భూ వివాదానికి సంబంధించి ఫెన్సిస్టేషన్ సిస్టమ్ ప్రైవేట్ లిమిటెడ్‌పై 100 మందితో దాడి చేశారని, కోట్ల రూపాయల విలువైన సామగ్రిని తీసుకువెళ్లారని.. దీనిపై ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు నమోదు చేయలేదని అజయ్ అగర్వాల్, సులోచన అగర్వాల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి సోమవారం విచారణ చేపట్టారు. పోలీసులకు దాడి విషయంపై ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. పలుమార్లు అడిగాక వారం తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు చేశారని, పిటిషనర్లకు రక్షణ కల్పించేలా పోలీసులను ఆదేశించాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. దాడి అంశంపై నివేదిక అందజేయాలని ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్, ఎస్ఐ మల్లేశ్వర్ ఆదేశించింది. అలాగే ఎమ్మెల్యే గాంధీకి వ్యక్తిగతంగా నోటీసులు పంపాలంటూ పిటిషనర్‌కు సూచిస్తూ.. తదుపరి విచారణను ఆగస్టు 10కి వాయిదా వేసింది.

అతి వేగమే ప్రమాదానికి కారణం

ప్రమాద ఘటనా స్థలాన్ని పరిశీలించిన మాదాపూర్ డీసీపీ



బయోడైవర్సిటీ లెవల్-2 ఫ్లై ఓవర్‌ను పరిశీలిస్తున్న మాదాపూర్ డీసీపీ గోనె సందీప్

గచ్చిబౌలి: బయోడైవర్సిటీ ఫ్లై ఓవర్‌పై చోటుచేసుకున్న ప్రమాదం అతి వేగం కారణంగానే జరిగిందని పోలీసులు పేర్కొంటున్నారు. బైక్ అదుపు తప్పి రెయిలింగ్‌ను ఢీకొట్టి ఫ్లై ఓవర్‌పై నుంచి లెవల్-2 ఫ్లైఓవర్‌పై పడి ఓ యువకుడు మృతి చెందగా మరోకరు ప్రాణపాయ స్థితిలో ఉన్న విషయం తెలిసిందే. సోమవారం బయోడైవర్సిటీ ఫ్లై ఓవర్‌ను మాదాపూర్ డీసీపీ సందీప్ పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను పోలీసులను అడిగి తెలుసుకున్నారు. యమహా ఎంటీ15 బైక్ 6వ గేర్‌లో ఉండని, 120 కిలోమీటర్ల వేగంతో ప్రమాదానికి గురై ఉండవచ్చని పోలీసులు పేర్కొంటున్నారు. కుకునూరుపల్లి గ్రామం, మునుగోల్ మండలం, మెదక్ జిల్లాకు చెందిన బండి మధు(26), తేరాల గ్రామం, మోత్కూర్ మండలం, యాదాద్రి జిల్లాకు చెందిన పంజాల మచ్చ గిరి(24) గచ్చిబౌలి టిమ్స్ ఆస్పత్రిలో ఎంఆర్ఐ టెక్నీషియన్లుగా పనిచేస్తూ మధురానగర్‌లో ఉంటున్నారు. యమహా ఎంటీ 15(టీఎస్36కె5128)పై ఆస్పత్రికి బయలుదేరారు. బయోడైవర్సిటీ ఫ్లై ఓవర్‌పై షాగౌస్ సమీపంలో ఫ్లైఓవర్‌పై కుడి వైపు రెయిలింగ్‌కు ఢీ కొట్టడంతో ఎగిరి లెవల్-2 ఫ్లైఓవర్‌పై పడ్డారు. దీంతో మధు అక్కడికక్కడే మృతి చెందగా తీవ్ర గాయాలతో మచ్చ గిరి కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

స్పీడ్ లిమిట్ 40 కేఎం..

బయోడైవర్సిటీ ఫ్లై ఓవర్‌పై స్పీడ్ లిమిట్ గంటకు 40 కిలో మీటర్లుగా ట్రాఫిక్ పోలీసులు నిర్ణయించారు. గతంలో ఇదే ఫ్లై ఓవర్లపై ప్రమాదాలు చోటు చేసుకోవడంతో అడుగడుగునా రంబుల్ స్ట్రిప్స్ స్పీడ్ బ్రేకర్లు వేశారు. హై స్పీడ్ ఉండటంతో స్పీడ్ బ్రేకర్లపై వెళ్తూ అదుపుతప్పి ఉంటుందని తెలుస్తోంది. బైక్ రెయిలింగ్‌కు తగిలి అక్కడే ఉండి పోగా బైక్ రైడర్ మధు, వెనుక కూర్చున్న గిరి ఎగిరి కింది భాగంలో ఉన్న లెవల్-2 ఫ్లై ఓవర్‌పై పడ్డారు. గచ్చిబౌలి నుంచి రాయదుర్గం వైపు వన్ వేగా లెవల్-2 ఫ్లైఓవర్‌పై నుంచి ఆ సమయంలో ఎవరు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయ్యింది. అడుగడుగునా ట్రాఫిక్ పోలీసులు సైన్ బోర్డులు ఏర్పాటు చేసినా వాహనదారుల్లో మాత్రం మార్పు రావడం లేదు. నిబంధనలు ఉల్లంఘించడంతో విలువైన ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి.

హైటెక్స్‌లో ఎల్‌డీఎఫ్ ఎగ్జిబిషన్ ప్రారంభం



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న నారాయణదాసరి, అరుణ్‌కుమార్ తదితరులు

మాదాపూర్: హుజూరాబాద్‌లో తొలిసారిగా దళిత బంధు పథకం కింద రూ.18000 వేల కోట్లు పంపిణీ చేసిందని డీఐసీసీఐ కో ఆర్డినేటర్ నారాయణ దాసరి పేర్కొన్నారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో సోమవారం దళితబంధు పథకం లబ్ధిదారుల ప్రయోజనం కోసం పశుసంపద, పాడిపరిశ్రమ, మత్స్య పరిశ్రమలలో వ్యాపార అవకాశాల కోసం ఎల్‌డీఎఫ్ (లైవ్‌స్టాక్, డెయిరీ, ఫిసరీస్) ఇండియా ఎక్స్‌పో నిర్వాహకులతో (దళిత్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ) డీఐసీసీఐతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి దళిత కుటుంబానికి ఒకేసారి రూ.10లక్షల ఆర్థిక సహాయం అందించడం ఈ పథకం ఉద్దేశమన్నారు. మొదటి దశలో దాదాపు 32000 మంది లబ్ధిపొందినట్టు తెలిపారు. చాలా మంది లబ్ధిదారులు రవాణా రంగంలో వ్యాపారాలు స్థాపించినట్టు తెలిపారు. పశుపోషణలో 2000, డెయిరీలో 1800 నుంచి 2వేలు, మేకల పెంపకంలో 1500 యూనిట్లు ఏర్పాటు చేశారన్నారు. డిక్కి నెక్స్‌జెన్ కన్వీనర్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 118 నియోజకవర్గాల్లో రెండో దశలో 1.3 లక్షల కుటుంబాలకు దళితబంధు పథకాన్ని వర్తింపచేయాలని ఈ ఏడాది మార్చిలో మంత్రివర్గం నిర్ణయించిందన్నారు. హైటెక్స్‌కు చెందిన సంబిత్ ముండ్ మాట్లాడుతూ.. ఎల్‌డీఎఫ్ ఇండియా దేశంలోనే దేశంలోనే మొట్టమొదటి సమగ్రమైన పశుసంపద, డెయిరీ, ఫిసరీస్ ఎక్స్‌పో అన్నారు. భారతదేశంలోనే తొలిసారిగా నగరంలోని హైటెక్స్‌లో సెప్టెంబర్ 21 నుంచి 23 వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు.

కొండాపూర్ వైపు వాహనాల రాకపోకలకు అనుమతి

గచ్చిబౌలి: గచ్చిబౌలి ఓఆర్ఆర్ జంక్షన్ నుంచి కొండాపూర్ వైపు వాహనాల రాకపోకలకు అనుమతించారు. సోమవారం రాత్రి సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ హర్షవర్ధన్ వాహనాల రాకపోకలకు ప్రారంభించారు. గచ్చిబౌలి జంక్షన్‌లో ఓఆర్ఆర్ నుంచి కొండాపూర్ రోడ్డులో రాడిసన్ హోటల్ వరకు లెవల్-2 ఫ్లైఓవర్ నిర్మాణం పనులు చేపడుతున్నారు. నిర్మాణ పనులకు అంతరాయం కలుగకుండా, ప్రయాణికులు ప్రమాదాల బారిన పడకుండా ఉండాలనే ఉద్దేశంతో మే 13 నుంచి కొండాపూర్ రోడ్డులో రెండు వైపుల వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ఆగస్టు 10వ తేదీ వరకు గచ్చిబౌలి జంక్షన్ నుంచి కొత్తగూడ వైపు వెళ్లే రోడ్డును రెండు వైపులా మూసివేస్తున్నట్లు ఇప్పటికే ప్రకటించినా తాజాగా గచ్చిబౌలి నుంచి కొండాపూర్ వైపు వెళ్లే వాహనాలను మాత్రమే అనుమతించారు. కొండాపూర్ నుంచి గచ్చిబౌలి జంక్షన్ వైపు వాహనాల రాకపోకలకు ఎలాంటి అనుమతి ఇవ్వలేదు. ప్రస్తుతం ఉన్న మళ్లింపు కొనసాగనుంది.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



కొండాపూర్ ఏరియా ఆస్పత్రిలో రక్తదానం చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ



ఖాజాగూడలోని కేక్ కట్టింగ్ కార్యక్రమంలో సాయిబాబా, నాయకులు

గచ్చిబౌలి/రాయదుర్గం: అన్ని దానాల కన్నా రక్తదానం ఎంతో గొప్పదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. మంత్రి కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని కొండాపూర్‌లోని ఏరియా ఆస్పత్రిలో మెగా రక్తదాన శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ స్వయంగా రక్తదానం చేయడం విశేషం. అనంతరం జరిగిన సమావేశంలో కేక్ కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. కార్పొరేటర్లు హమీద్ పటేల్, రాగంనాగేందర్ యాదవ్, మంజులా రఘునాథ్‌రెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్, జగదీశ్వర్‌గౌడ్, నార్నె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఖాజాగూడలో..

మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను ఖాజాగూడలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ సాయిబాబా ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. బీఆర్ఎస్ నాయకులు చెన్నం రాజు, జంగయ్య యాదవ్, దారుగుపల్లి నరేష్, అంజమ్మ, శంకరిరాజు, రమేష్‌గౌడ వెంకటేష్, నారాయణ, గోవింద్, శ్రీనివాస్, సుధీర్, భిక్షపతి, ఫయాజ్, ఖాదర్‌ఖాన్, రాణి, మాధవి, సుగుణ, బాలమణి పాల్గొన్నారు.

నూతన డీసీని కలిసిన కార్పొరేటర్



రాయదుర్గం: శేరిలింగంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన రజనీకాంత్‌రెడ్డిని సోమవారం కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి కలిశారు. గచ్చిబౌలి డివిజన్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. డీసీ స్పందిస్తూ త్వరలోనే అన్ని శాఖల అధికారులతో ఒక ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసుకుందామని తెలిపారు. అనంతరం గంగాధర్ రెడ్డి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస్‌తో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. పెండింగ్ పనులను వెంటనే ప్రారంభించి త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని ఈఈని కార్పొరేటర్ కోరారు. ఈ కార్యక్రమంలో డీఈ శ్రీనివాస్, నాయకులు శ్రీరాములు, నర్సింగ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో సహాయక చర్యలు



లోతట్టు ప్రాంతంలోని వారితో మాట్లాడుతున్న కార్పొరేటర్

రాయదుర్గం: ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు ఇబ్బందులు పడ్డ లోతట్టు ప్రాంతాల్లో గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి సోమవారం పర్యటించారు. టెలికామ్‌నగర్‌లో శివారు బస్తీలో వరద ముంపు ప్రాంతాల్లో ఆయన జీహెచ్ఎంసీ ద్వారా చేపట్టిన సహాయక చర్యలు, రోడ్లపై పేరుకపోయిన వ్యర్థాలు, కాలువల్లో సాఫీగా నీటిపారుదల అడ్డంకులను జేసీబీతో తొలగించే పనులను పరిశీలించారు. అనంతరం స్థానికులతో కలిసి ఆయన మాట్లాడి వారికి భరోసా ఇస్తూ పూర్తిగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. టెలికామ్‌నగర్ ప్రాంతంలో రోడ్లపై వరద నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మురుగు, వరద నీటికాలువలు, నాలాల్లో చెత్తాచెదారం, వ్యర్థాలను తొలగించాలని కోరారు. మాన్‌సూన్ టీమ్ ద్వారా అన్ని చర్యలు తీసుకొని ప్రజలు ఇక్కట్లు పడకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవీందర్‌రెడ్డి, శ్రీరాములు, నర్సింగ్ నాయక్, స్థానికులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో గుర్రంజాషువా వర్ధంతి



వేడుకల్లో వీసీ ప్రొఫెసర్ సర్రాజు, హెచ్‌సీయూ ఆచార్యులు

రాయదుర్గం: కులమతాలులేని విశ్వమానవతను ఆకాంక్షించిన కవులలో ఒకరు గుర్రం జాషువా అని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ ఆర్ఎస్ సర్రాజు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ తెలుగు విభాగంలో తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో గుర్రంజాషువా 51వ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జాషువా భారతీయ సంస్కృతిని, దానిలో తెలుగు వారి ప్రత్యేకతలను వివరించిన వ్యక్తి అని గుర్తుచేశారు. తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. గుర్రం జాషువా భారతమాత గురించి వర్ణించినంత ఔనత్యాన్ని మరేకవి వర్ణించలేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఆచార్యులు గోనానాయక్, పమ్మిపవన్‌కుమార్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై ఆరోపణలు అవాస్తవం

జిన్నారం(పటాన్‌చెరు): ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిపై బీజేపీ నాయకులు చేస్తున్న అవినీతి ఆరోపణలు అవాస్తవమని గుమ్మడిదల ఎంపీపీ ప్రవీణ, జెడ్పీటీసీ కుమార్‌గౌడ్ అన్నారు. సోమవారం గుమ్మడిదలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కానుకుంట-గుమ్మడిదల గ్రామాల మధ్య చేపడుతున్న రోడ్డు పనుల్లో అవినీతి జరిగిందని ఇటీవల బీజేపీ నాయకులు చేసిన ఆరోపణలు సరైనవి కావన్నారు. ఎమ్మెల్యే తన సొంత నిధులు రూ.9కోట్లు వెచ్చించి డబుల్ రోడ్డు పనులను చేయిస్తున్న విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. నాయకులు గోవర్ధన్ రెడ్డి, సద్ది విజయభాస్కర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, హుస్సేన్, మురళి, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

బీఎల్‌ఓలకు అవగాహన



మాట్లాడుతున్న ఏఎంసీ సురేష్ తదితరులు

హఫీజ్‌పేట్: చందానగర్ సర్కిల్ 21 కార్యాలయం అంబేడ్కర్ కల్యాణ మండపంలో సోమవారం సర్కిల్ పరిధిలోని బూత్ లెవల్ ఆఫీసర్ల (బీఎల్‌ఓ)కు ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చందానగర్ సర్కిల్ ఏఎంసీ సురేష్, సూపరింటెండెంట్ విజయ్‌కుమార్, డిప్యూటీ ఈఈ దుర్గప్రసాద్, మాస్టర్ ట్రైనర్స్ ఏఈ అంజయ్య, ఎలక్ట్రికల్ ఏఈ రామ్మోహనరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఎల్‌ఓలకు తమ విధుల నిర్వహణపై శిక్షణ కల్పించడం జరిగిందన్నారు. నూతన ఓటర్ల జాబితాల్లో తప్పులు లేకుండా ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించి విచారణ చేయాలన్నారు. ఎన్నికల కమిషన్ అప్పగించిన పనులను సక్రమంగా పూర్తి చేయాలన్నారు. ప్రతి బీఎల్‌ఓకు తమ పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉన్న ఓటర్ల జాబిత వివరాలు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో 233 బీఎల్‌ఓలు హాజరయ్యారు.

సందడిగా ఫలహారం బండి ఊరేగింపు



ఫలహారం బండి ఊరేగింపులో నటుడు మంచు మనోజ్ తదితరులు

మాదాపూర్: ఎన్ని సమస్యలున్నా, ఎన్ని మనస్పర్థలున్నా అందరినీ ఒక్కటి చేసేవి పండగలే అని సినీనటుడు మంచు మనోజ్ అన్నారు. సోమవారం అయ్యప్ప సొసైటీలో ఎర్రగుడ్ల వెంకట్‌యాదవ్, షణ్ముక్‌యాదవ్, రంజిత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమంలో ఆయన తన సతీమణి భూమా మౌనికతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మనోజ్, మౌనిక దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఫలహారం బండి ఊరేగింపు సందర్భంగా పోతరాజులు, శివసత్తులు నిర్వహించిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం వందలాదిగా విచ్చేసిన బస్తీవాసులు, భక్తుల నడుమ అమ్మవారి ఊరేగింపు ఉత్సాహభరిత వాతావరణంలో ముందుకు సాగింది.

హార్లీ డేవిడ్‌సన్ నయా లుక్

సాక్షి, సిటీబ్యూరో: హార్లీ డేవిడ్‌సన్ బైక్ నయా లుక్‌తో బైకర్స్‌ను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఎక్స్ 440 మోడల్ అందుబాటులోకి వచ్చింది. లక్ష్మి గ్రూపు బంజారాహిల్స్‌లో ఈ వాహనాలు విక్రయానికి సిద్ధంగా ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు.



వైభవంగా శ్రావణ సోమవారం పూజలు



చంద్రమౌళీశ్వరస్వామికి ప్రత్యేక అలంకారం



శివసాయిక్షేత్రంలో కాశీ విశ్వేశ్వరస్వామికి పూజలు

రాయదుర్గం: శ్రావణ మాస మొదటి సోమవారాన్ని పురస్కరించుకొని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివుడికి ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. గచ్చిబౌలి జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో శ్రావణ మాస ప్రత్యేక పూజలను నిర్వహించారు. అందులో బాగంగా ఆలయంలోని కాశీవిశ్వేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేసిన తర్వాత ప్రత్యేక అలంకారం చేశారు. గౌలిదొడ్డిలోని శివాలయంలో కూడా సోమవారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ అర్చకుల సమక్షంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.